# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-12-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **దేశంలో రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా ఈ రోజు రాజ్యసభలో ప్రత్యేక చర్చ జరుగుతోంది.**
2. **రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయడు ఈరోజు ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టును సందర్శించారు.**
3. **భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం రెవిన్యూ సదస్సులను నిర్వహిస్తోందని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.**
4. **రాష్ట్రం నుంచి ఎన్నికైన ముగ్గురు రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, ఆర్ కృష్ణయ్య, సానా సతీష్ ఈ రోజు ప్రమాణ స్వీకారం చేశారు.**
5. **దేశంలో తొలిసారి విజయవాడలో “క్లౌడ్ పెట్రోలింగ్” ప్రారంభించామని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ తెలిపారు.**

==========================

దేశంలో రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగంపై రెండు రోజుల ప్రత్యేక చర్చ ఈ రోజు రాజ్యసభలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ రాజ్యసభలో ప్రసంగించారు.

వాయిస్ ... 21 సెకన్లు

కాగా దేశంలో రాజ్యాంగం అమలోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం, శనివారం నాడు లోక్ సభలో కూడా ప్రత్యేక చర్చ జరిగింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాజ్యసభలో రేపు ప్రసంగించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

---------------------------

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయడు ఈ రోజు ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టును సందర్శించారు. విహంగ వీక్షణం ద్వారా ప్రాజెక్టు పనులను పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు పురోగతిపై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి అధికారులు, ఇంజినీర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు.

ఈ సమీక్షా సమావేశంలో ప్రాజెక్టు పనులు, నిర్వాసితుల పునరావాసంపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...

...వాయిస్....30 సెకన్లు

---------------------------

భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం రెవిన్యూ సదస్సులను నిర్వహిస్తోందని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం బోరెడ్డి గారి పల్లెలో నిర్వహించిన "ప్రజాదర్బార్" కార్యక్రమంలో మంత్రి ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.... ఎన్డీయే కూటమి ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రజాదర్బార్ కార్యక్రమాలు నిర్వహించి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. రెవెన్యూ అధికారులు భూ సమస్యలపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి సూచించారు.

---------------------------

దేశంలో తొలిసారి విజయవాడలో "క్లౌడ్ పెట్రోలింగ్" ప్రారంభించామని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంతో క్లౌడ్ పెట్రోలింగ్' పేరుతో డ్రోన్ల గస్తీని నగర పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబుతో కలిసి ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ,

వాయిస్ ...22 సెకన్లు

అనంతరం పోలీస్ కమీషనర్ ఎస్.వి. రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ...

వాయిస్ ...20 సెకన్లు

---------------------------

రాష్ట్రం నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన ముగ్గురు రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, ఆర్ కృష్ణయ్య, సానా సతీష్ ఈ రోజు ప్రమాణ స్వీకారం చేశారు. ఢిల్లీలో ఈ ఉదయం వారితో రాజ్యసభ చైర్మన్ జగదీప్ దన్ ఖడ్ ప్రమాణ స్వీకారం చేయించారు. రాజ్యసభ ఉప ఎన్నిక ఇటీవల జరగగా ఈ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు దేశం పార్టీ నుంచి బీద మస్తాన్ రావు, సానా సతీష్, భారతీయ జనతా పార్టీ నుంచి ఆర్ కృష్ణయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు.

---------------------------

తెలుగు భాషాభివృద్ధి కోసం సాహితీ యాత్రలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుందని ఉప ముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్ అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో పవన్‌కల్యాణ్‌ను విజయవాడ బుక్ ఫెస్టివల్ కమిటీ ప్రతినిధులు నిన్న కలిశారు. విజయవాడలో పుస్తక మహోత్సవ నిర్వహణ సమస్యలను వారు ఆయన దృష్టికి తీసుకెళ్లగా సమస్యను పరిష్కరిస్తామని పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. అనంతరం ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఆధ్యాత్మిక, చారిత్రక స్థలాల పర్యాటకం విధంగానే సాహితీ పర్యాటకం రావాలన్నారు. కవులు, రచయితల స్వస్థలాలు, వారి జ్ఞాపకాలు ఉన్న ప్రాంతాలను భాషాభిమానులు, విద్యార్థులు సందర్శించేలా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.

---------------------------

భారత ప్రముఖ తబలా విద్వాంసులు జాకీర్ హుస్సేన్ నిన్న కన్ను మూశారు. 73 సంవత్సరాల వయసు గల ఆయన గుండె సంబంధిత వ్యాధులతో చికిత్స పొందుతూ అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కో ఆస్పత్రిలో తుది

శ్వాస విడిచారు. 1951 వ సంవత్సరం మార్చి 9 వ తేదీన ముంబైలో జన్మించిన జాకీర్ హుస్సేన్ ప్రముఖ తబలా విద్వాంసులు ఉస్తాద్ అల్లా రఖా ఖాన్ కుమారుడు. దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా తబలా విద్వాంసునిగా జాకీర్ హుస్సేన్ పేరు పొందారు. భారత శాస్త్రీయ సంగీతానికి ఎనలేని సేవ చేసినందుకు గాను కేంద్ర ప్రభుత్వం ఆయనను 1988లో పద్మశ్రీ ..., 2022లో పద్మ భూషణ్ ..., 2023లో పద్మ విభూషణ్ పురస్కారాలతో సత్కరించింది. సంగీత నాటక అకాడమీ ...., గ్రామీ పురస్కారాలు కూడా ఆయన పొందారు.

ఆయన మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతాపం వ్యక్తం చేశారు.

---------------------------

రహదారి ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని శ్రీకాకుళం జిల్లా ఉపరవాణా కమిషనర్ ఏ.విజయ సారధి అన్నారు. శ్రీకాకుళంలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతీ ఒక్కరూ రహదారి భద్రతా నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని కోరారు. రోడ్డు ప్రమాదాల్లో మరణించిన కుటుంబాలపై సమగ్ర గణన చేశామని అన్నారు. హెల్మెట్ వాడకపోవడం, అతి వేగం, పరిమితికి మించి బరువుతో వెళ్తున్న వాహనాలు రహదారి ప్రమాదాలకు ప్రధాన కారణమని ఆయన వివరించారు.

---------------------------

విద్యుత్ పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పి స్తున్నామని ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్-సీపీడీసీఎల్ ఆధ్వర్యంలో ఒంగోలులో నిర్వహించిన ఇంధన పొదుపు అవగాహన ర్యాలీని ఆమె ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ, భవిష్యత్తు తరాలకు సంప్రదాయ ఇంధన వనరులను అందించాలంటే విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలన్నారు.. విద్యుత్ పొదుపునకు సంబంధించి విద్యుత్ శాఖ ఇచ్చే సూచనలను ప్రజలు పాటించాలని కోరుతూ,

వాయిస్ .. 32 సెకన్లు

---------------------------

పార్వతీపురం మన్యం జిల్లాలో ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ రేపు పర్యటిస్తారని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. జిల్లాలోని కురుపాం నియోజకవర్గం గిరిజన గ్రామాలైన కిడవాయి, తిత్తిలి గ్రామాలను సందర్శిస్తారని ఆయన చెప్పారు. ఉపముఖ్యమంత్రి పర్యటించనున్న నేపథ్యంలో గుమ్మలక్ష్మీపురం మండలం ఎల్విన్ పేటలో హెలిప్యాడ్ ను జిల్లా కలెక్టర్ ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యటనకు సంబందించి అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

---------------------------

గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో జరుగుతున్న ట్రాక్ మరమ్మతు పనుల దృష్ట్యా ఈరోజు నుంచి ఈనెల 27 వరకు పలు రైళ్లను రద్దు చేయగా.. మరికొన్నింటిని దారి మళ్లించినట్టు డివిజనల్ రైల్వే మేనేజర్ విజయకుమార్ తెలిపారు. ఇందులో భాగంగా గుంటూరు-డోన్-గుంటూరు రైలు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఈనెల 20, 21వ తేదీల్లో పూరి-యశ్వంతపూర్-పూరి రైలు దారి మళ్లించినట్టు చెప్పారు. ఈనెల 18, 25 తేదీల్లో హౌరా-యశ్వంతపూర్ రైలును నంద్యాల, ఎర్రగుంట్ల, గుత్తి, అనంతపురం మీదుగా 20వ తేదీన యశ్వంతపూర్-హౌరా రైలును అనంతపురం, గుత్తి, ఎర్రగుంట్ల, నంద్యాల మీదుగా దారి మళ్లించి నడుపుతున్నట్లు తెలిపారు.

======================